క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాస పూజలు


శ్రీ వీరనారాయణ స్వామి

పాణ్యం: స్థానిక ఆలయాల్లో మంగళవారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని ఈఓ సువర్ణ సోమవారం తెలిపారు. వచ్చే నెల 13వ తేదీ వరకు పూజలు జరుగుతాయన్నారు. ఉదయం 5గంటల నుంచి ఆంజనేయస్వామి ఆలయంలో, 5.30గంటలకు స్థానిక వీరనారాయణస్వామి ఆలయంలో పూజలు ప్రారంభమవుతుయాన్నారు. అలాగే వచ్చేనెల 10వ తేదీన వైకుంఠ ఏకాధశి సందర్భంగా శ్రీ వీరసానారయణ స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కోడుమూరు రూరల్ : కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం అన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన యువతీ, యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణకు అర్హులని, ఆసక్తి గల వారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

చనుగొండ్ల వాసికి జోతిష్యంలో డాక్టరేట్


ఎల్లస్వామి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఎల్లస్వామికి జోతిష్యంలో డాక్టరేట్ లభించింది. వాస్తు, జోతిష్యంలో మూడేళ్ల పాటు పరిశోధనలు చేయడంతో శుక్రాచార్య వేదాంగ యూనివర్సిటీ బెంగళూరు వారు డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

పాణ్యం : మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 17 నుంచి 28 వరకు ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో సమస్య ఉన్న వారు, మార్పులు, చేర్పులు కొరకు ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

కర్నూలు(రూరల్): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అయన మాట్లతుతూ గ్రామంలో చెత్త ఎక్కడ పడితే, అక్కడ వేయరాదని ప్రజలకు సూచించారు. క్లాప్ మిత్రలు గ్రామంలోని ప్రతివీధిలో తిరిగి చేత్తను సేకరిస్తారన్నారు. వారు దానిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తారని చెప్పారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

కర్నూలు(రూరల్): నగరంలోని మండల ప్రజాపరిషత్ మిటింగ్ హాలులో మంగళ, బుధవారాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లకు, మండల స్థాయి అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి (రెండవ బ్యాచ్) కార్యక్రమము నిర్వహిస్తూనట్లు కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్ సోమవారం తెలిపారు. శిక్షణకు అందరూ హాజరు కావాలన్నారు.

సి.బెళగల్ మండలంలో..

సి.బెళగల్: మండల అధికారులకు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, కొన్ని శాఖల సచివాయల ఉద్యోగులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. సోమవారం ఆమె ఓ ప్రకటనలో తెలియజేస్తూ స్థానికీకరణ, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి అధికార యంత్రాంగం తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

కల్లూరు : ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలసి వినతి పత్రమిచ్చి సమస్యల పరిష్కారించాలని కోరారు. వారు మాట్లాడుతూ డ్రైవర్లకు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ21, జీఓ31 రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ అమలు చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, ఈశ్వర్, గణేష్, రాము, క్రిష్ణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు


గోదా సమేత వేంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. సోమవారం తెల్లవారు జాము నుంచే నగర శివారు మాసమసీదు సమీపంలోని గోదాగోకులం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, కృష్ణానగర్‌లోని శ్రీనివాసమందిరం, సీక్యాంప్‌లోని విజ్ఞాన మందిరం, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం, రంగరాజు వీధిలోని మాలెబాలె సత్రం, సంకల్‌బాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, దండెగేరిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రాతఃకాల పూజలు జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో తిరుప్పావైలోని మొదటి పాశురాన్ని పఠించారు. పూజల్లో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


సూర్యనారాయణ స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


గోదాగోకులంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


గౌరీ శంకర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

నేడు పలుకుదొడ్డిలో రెవెన్యూ సదస్సు

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. రైతులు, ప్రజల నుంచి భూ సమస్యలపై గ్రామసభలలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. 18న ఎం.సోమాపురం (తిమ్మందొడ్డి) గ్రామంలో రెవెన్యూ సదస్సు ఉంటుందన్నారు. మండల ప్రజలు, రైతులు కార్యక్రమాలలో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు చింతమానుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ మల్లేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం సి.బెళగల్ గ్రామ రైతు సేవా కేంద్రంలో, మధ్యాహ్నం చింతమానుపల్లె గ్రామ సచివాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాల సందర్శన కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఆయా గ్రామాల రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు : రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. సోమవారం మండలంలోని కొమరోలు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూ సమస్యలను తమ దృష్టికి తెస్తే, వాటిని రీసర్వే చేసి 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో సుమారు 35 వినతులు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, దేవదాయశాఖ ఈఓ మద్దిలేటి, గ్రామ సర్పంచు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు మానుకోవాలి

పాణ్యం : బతుకుపై భరోసా కోసం సమ్మె బాటపట్టిన గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపునకు పాల్పడుతోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. సోమవారం పాణ్యంలోని గిరిజన పాఠశాలను సందర్శించి, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల బాల, బాలికలు పాఠశాలలలో పాఠాలు చేప్పేవారు లేక 10వ తరగతి విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, మహానంది, నెరవాడ, పాణ్యం, ఆళ్లగడ్డ, ఆలూరు, తుగ్గలి మండలాల్లో గిరిజన గురుకుల బాలుర, బాలికల పాఠశాలలో పాఠాలు చేప్పవారు లేక విద్య కుంటుపడుతోందన్నారు. పాణ్యం గిరిజన బాలుర పాఠశాలలో 220మంది గిరిజన విద్యార్థులు చదువుతుండగా ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. వీరు అందరూ అవుట్‌సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు గత నెల 14న సమ్మెలోకి వెళ్లడంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఒక టీచర్ మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి ఉపాధ్యాయులకు న్యాయం చేసి విద్యార్థులకు విద్యా ప్రమాణాలను పెచేందుకు కృషి చేయాలని కోరారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సర్వేపై అవగాహన కల్పిస్తున్న హేమలత

ఓర్వకల్లు : క్యాన్సర్ వ్యాధిపై సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య కార్యక్రమ(ఆర్‌బీఎస్‌కే)అధికారిణి హేమలత సూచించారు. సోమవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాగమయూరి కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో నిర్వహించిన అసంక్రమిత వ్యాధులు, ఎన్‌సీడీ 3.0 సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా నోటి కాన్సర్, రొమ్ము కాన్సర్, గర్భాశయ కాన్సర్ సర్వేలపై వివరాలను సేకరించాలన్నారు. అనంతరం జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డా.సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాఘవరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వినీత, మహిళా ఆరోగ్య కార్యకర్త కేశమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేసిన రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్

ఓర్వకల్లు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని రిటైర్డు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు షేక్ మహమ్మద్ ఇక్బాల్ అభిప్రాయపడ్డారు. సోమవారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత నిమిత్తం దాదాపు రూ.60 వేలు విరాళాన్ని ప్రకటించారు. అంతేకాక మరో రూ.35 వేలు నగదును పాఠశాలకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఎస్‌ఎంసీ చైర్మన్ తలారి విజేయుడు పాఠశాలకు రూ.2 వేలు అందజేశారు. అలాగే రూ.25వేల విలువ చేసే క్రీడా సామగ్రితో పాటు 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కొరకు రూ.35 వేల నగదును పాఠశాల హెచ్‌ఎం ప్రాణేష్ కుమార్‌కు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్ మద్దిలేటి, కెపెన్లు రాజీవ్ కుమారి, కళావతి, హన్నా సైమన్, గౌరి నందారెడ్డి, ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం


8రోజులుగా గూడూరులో సమ్మె చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని గూడూరు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆరవింద్, మధు అన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా గూడూరు నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షలు సోమవారం 8వరోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి కార్మికుడికి టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా వేతనాలు పెంచాలన్నారు. 15సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు దూకేశ్వరరావు, షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, ఆలీబాషా, హరి, సుధాకర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేది (పీజీఆర్ఎస్)లో మండల ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలను ప్రాధాన్యతగా భావించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఉదయం 11 గంటల వరకు పలువురు మండల అధికారులు కార్యక్రమానికి హాజరు కాలేదు. కార్యక్రమంలో కేవలం మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్, విద్యుత్ ఏఈ సుకుమార్, ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, వీఆర్వోలు మాత్రమే హాజరయ్యారు.

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

- కళావతి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు
- డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నాం
- కమిషనర్‌కు పలువురి వినతి


సమస్యలను కమిషనర్ రవీంద్రబాబుకు వివరిస్తున్న నగరవాసులు

కర్నూలు (టౌన్): సార్.. చాలా సార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించాం. కానీ పట్టించుకోవడం లేదు. వెంకటరమణ కాలనీలో జనావాసాల మధ్యనే పశువులను పెంచుతున్నారు. పరిసర ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని స్థానికంగా నివసించే జి.లక్ష్మీపతియాదవ్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగర పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు కమిషనర్ రవీంద్రబాబుకు తమ సమస్యలు వివరించారు. ప్రజా సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని, పందుల సమస్య పరిష్కరించాలని చింతలముని నగర్‌కు చెందిన ప్రభావతి, వీరేంద్ర వినతిపత్రం అందజేశారు.
- ఈ నెల 30వ తేదీ ఏపీఎస్‌పీ క్యాంపులో సివిల్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, ప్రత్యేక పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఏపీఎస్‌పీ సూపరింటెండెంట్ మాధవ్ కోరారు.
- కళావతి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు నారాయణ ఫిర్యాదు చేశారు.
- డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని రాధానగర్, రేణుకా నగర్‌కు చెందిన కాలనీవాసులు ప్రవీణ్, ఉపేంద్ర అభ్యర్థించారు.
- వెంకటరమణ కాలనీ, వీనస్ కాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు బి.క్రిష్ణమోహన్, శివయ్య ఫిర్యాదు చేశారు.
- టిడ్కో ఇంటి కోసం తాము చెల్లించిన నగదు తిరిగి ఇప్పించాలని దరఖాస్తుదారులు సునీత, అనురాధ వినతిపత్రం అందజేశారు.
- కె.సి.కెనాల్ వద్ద విస్తరణ పనుల్లో నివాసాలు కోల్పోయిన తమకు తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేయాలని శికారీలు విన్నవించారు.

8వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె


నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): చాలీచాలనీ వేతనాలతో పని చేస్తు న్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా? అని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ ఎదుట చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తమకు వర్తింపజేయాలన్నారు. అసోసియేషన్ నాయకులు జ్ఞానమ్మ, షేక్షావలి, కార్మికులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

ఓర్వకల్లు : సీపీఎం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కార్యదర్శి నాగన్న తెలిపారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన మండల 3వ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఇందులో మండల కార్యదర్శిగా నాగన్న, కమిటీ సభ్యులుగా శ్రీధర్, చంద్రబాబునాయుడు, మధుసూదన్, వెంకటేశ్వర్లు, సుధాకర్, చాంద్‌బాషా, మల్లేష్, మద్దిలేటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హ్యాండ్‌బాల్ విజేతలకు అభినందన

కర్నూలు(టౌన్): అనంతపురం జిల్లా రాప్తాడు లో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టును సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్రరెడ్డి అభినందించారు.

పడకేసిన పారిశుద్ధ్యం


ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. జి.శింగావరం ఎస్సీ కాలనీలో మురుగునీరు ఇళ్ల ముందే నిలవడంతో దుర్గంధం వెదజలుతోంది. దీంతో ఆకాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కమూసుకోవాల్సిన పరిస్థితి. మురుగునీటి వల్ల దోమలు, విషకీటకాల బారినపడి ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి పాండురంగారెడ్డి

కర్నూలు (లీగల్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయ భవనంలో శిక్షణను జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పాండురంగారెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం హైకోర్టు అన్ని జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రవేశపెట్టాలని తీర్మానించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు మధ్యవర్తిత్వంను ఏ విధంగా చేయాలని న్యాయవాదులకు అవగాహన కల్పించనున్నారు. చెన్నై, బెంగుళూరు నుంచి మధ్యవర్తిత్వం శిక్షణ సిబ్బంది ఎస్.అరుణాచలం, ఎస్.ఎన్.సుధ వచ్చారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అని తెలిపారు. దీని వల్ల కోర్టులో కేసులు విచారణ వరకు వెళ్లకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు.

జీసీటీఏ రాష్ట్ర కార్యవర్గంలో చోటు


కె.బాలసుబ్రహ్మణ్యం రాయలసీమ జోన్ అధ్యక్షుడు


రాష్ట్ర కోశాధికారి జి.ఎల్లాకృష్ణ

కర్నూలు సిటీ: ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) 37వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా డాక్టర్ కె.బాలసుబ్రమణ్యం (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు), డాక్టర్ జి.ఎల్లాకృష్ణ (సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ, అర్థశాస్త్ర అధ్యాపకులు) రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాలు నాగన్న (కామర్స్ లెక్చరర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ), కార్యదర్శి డాక్టర్ దళవాయి శ్రీనివాసులు(కామర్స్ లెక్చరర్, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

యువ రచయితకు సన్మానం


రచయిత రఘును సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని దిన్నెదేవరపాడుకు చెందిన యువ రచయిత మీసాల రఘును ఘనంగా సన్మానించారు. మంత్రాలయంలోని పరిమళ పాఠశాల ఆవరణలో జరిగిన జాతీయ శతక కవి సమ్మేళనంలో రఘు పాల్గొని తన కవితను వినిపించి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షుడు నారాయణ రెడ్డి తదితరులు రఘును సన్మానించారు.